ముంపు సమస్య తీరేనా?

- మంజీర నదిలో పొదల, పూడిక తొలగింపునకు గతేడాది రూ.1. 20 కోట్లతో ప్రతిపాదనలు
- ముందుకు సాగని ప్రక్రియ


మంజీర పరీవాహక ప్రాంతంలో ముంపునకు గురైన పంటలు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలోని రైతులకు కొన్నేళ్లుగా పంటల ముంపు సమస్య తీరడం లేదు. మంజీరా నదిలో పొదలు, పూడిక పెరగడం వల్ల భారీ వర్షాలు కురిసిన సమయంలో పరివాహక ప్రాంతంలోని పంటలు ముంపునకు గురవుతున్నాయి. 12 గ్రామాలకు చెందిన రైతులు ప్రతియేడు వర్షాలు విస్తారంగా కురిసిన సమయంలో పంటల ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గోలిలింగాల, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ తదితర గ్రామాల శివారులో 15 వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురవుతుంటాయి. సమస్యను పరిష్కరించేందుకు గతేడాది నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేపట్టి మంజీరానదిలో పెరిగిన పొదలు, తుమ్మచెట్లు, పూడికను తొలగించాలని పేర్కొంటూ అందుకనుగుణంగా ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పూడిక తొలగింపు పనులు చేపట్టే అవకాశం ఉంది. చీనూర్‌వాడి నుంచి మాసాన్‌పల్లి వరకు మంజీర పరివాహక ప్రాంతంలో 13 కిలోమీటర్ల మేర పొదలను, అక్కడక్కడా పూడికను తొలగించడానికి రూ.కోటి 20 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇక ప్రభుత్వ నుంచి అనుమతులు రావడమే ఆలస్యం.

అనుమతులు వచ్చిన వెంటనే..

మంజీరా నదిలో పొదల, పూడిక తొలగింపునకు సంబంధించి గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పరివాహక ప్రాంతంలో 13 కిలోమీటర్ల మేర సర్వే చేసి ప్రతిపాదనలు తయారుచేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పొదల, పూడిక తొలగింపు పనులను చేపడతాం.
– వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ, ఎల్లారెడ్డి

క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జలాల్‌పూర్, అచ్చాయపల్లి, రామక్కపల్లి గ్రామాలలో ఈవీఎంల వినియోగంపై బుధవారం అధికారులు అవగాహన కల్పించారు. ఈవీఎం మిషన్‌పై ఓటువేసే విధానాన్ని వారు వివరించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఈవీఎం మిషన్లను పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎంపీవో ప్రకాష్, జలాల్‌పూర్ సర్పంచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు మల్లిఖార్జున్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

మాచారెడ్డి: గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ.4 లక్షల మంజూరు పత్రాన్ని బుధవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రామ్ రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, స్థానిక ఉప సర్పంచ్ కిషన్, తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలకు రూ.12 కోట్లు

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్ – కోనాపూర్ గ్రామాల సరిహద్దులో నూతనంగా మంజూరైన తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 కోట్లు విడుదల చేసింది. ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ ద్వారా అందిన అంచనా మేరకు ఈ నెల 1న ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మంజూరైన నిధులతో పాఠశాల, హాస్టల్‌కు ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి పాఠశాలలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన సీహెచ్ సంజీవరెడ్డిని యువసేన యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువసేన యూత్ సభ్యులు రమేష్ గౌడ్, జనార్దన్, సాయి ప్రశాంత్, శ్రీనివాస్ , రవీందర్, రాజు, అశోక్, సాయి, తేజ పటేల్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన వారికి..



కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్‌లో దేవునిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ తెలిపారు. పరుగు పందెంలో అండర్–16 విభాగంలో పదోతరగతికి చెందిన సింధుజ, అండర్–14 విభాగంలో 8వ తరగతికి చెందిన మేఘనలు మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల పీఈటీ సంజీవులను సైతం ప్రత్యేకంగా అభినందించారు.

పాలాభిషేకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీడీ కంపెనీ టేకేదారులు పాలాభిషేకం చేశారు. బీడీ టేకేదార్లకు పింఛన్ ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించడాన్ని హర్షిస్తూ, కృతజ్ఞతలు తెలిపారు. తమపై కనికరించి తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

బార్‌లో చోరీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని కొత్త బస్టాండ్‌కు కొద్ది దూరంలో ఉన్న ఓ బార్‌లో బుధవారం వేకువజామున దొంగలు పడ్డారు. కిటికీలను ధ్వంసం చేసి లోనికి చొరబడిన దొంగలు నగదు, విలువైన వస్తువులు లభించకపోవడంతో సీసీ కెమెరాల డీవీఆర్‌ను, రెండు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే గమనించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నిజాంసాగర్(జుక్కల్): జవహర్ నవోదయ విద్యాలయం నిజాంసాగర్‌లో బుధవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధుల పట్ల విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మందులు అందజేశారు. వైద్యుడు రత్నం పాల్గొన్నారు.

పంటల్లో నిలిచిన నీటిని తీసివేయాలి


పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్ కుమార్

మద్నూర్(జుక్కల్): అధిక వర్షాలతో పంటల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తీసివేయాలని బిచ్కుంద ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సుల్తాన్‌పేట్ శివారులోని సోయాబీన్, పత్తి, మినుము, పెసర తదితర పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. చేనులో నీటిని తీసేసిన తర్వాత ఎకరాకి 20 కిలోల యూరియా, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 10 కిలోలు డోసుగా వేసుకోవాలని సూచించారు.

తాడ్వాయి మండలం పెద్దేమిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పెద్దేమి శివారులో బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయఅధికారులు పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలను పరిశీలించిన అనంతరం సూచనలు చేశారు. చీడపీడలు, పోషక లోపాల సవరణ గురించి వివరించారు. రుద్రూర్ కృషివిజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ నవీన్, ఉద్యానవన శాస్త్రవేత్త వెంకట రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): శివపూర్ గ్రామ శివారులో మొక్కజొన్న, పత్తి, సోయా పంటలను మండల వ్యవసాయ అధికారి నదీమ్ పరిశీలించారు. పంటలలో పాటించవలసిన మెలకువల గురించి అవగాహన కల్పించారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన కార్మికులు


ట్యాంక్ ఎక్కిన కార్మికులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 28వ రోజుకు చేరింది. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో భాగంగా వినూత్నంగా నిరసనలు తెలిపారు. ఎల్లారెడ్డిలో వాటర్ ట్యాంక్ ఎక్కి, నిజాంసాగర్‌లో మోకాళ్లపై కూర్చుని కార్మికులు నిరసన తెలిపారు. దోమకొండలో వంటావార్పు చేశారు. నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్ నేత కూనిపూర్ రాజిరెడ్డి జీపీ కార్మికులకు మద్దతు తెలిపారు. తాడ్వాయి మండలానికి చెందిన కార్మికులు హైదరాబాద్‌లో మంత్రి హరీష్ రావుని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు


అడ్లూర్‌లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

కామారెడ్డి రూరల్: అడ్లూర్ అంగన్‌వాడి కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవని అన్నారు. ముర్రుపాలను బిడ్డలకు ఇవ్వాలని బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

పిట్లం(జుక్కల్): అన్నారం అంగన్‌వాడి సెంటర్‌ను బుధవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు తనిఖీ నిర్వహించారు. సెంటర్‌లోని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు.

పశువులకు 'గాలికుంటు' టీకాలు


టీకాలు వేస్తున్న సర్పంచ్ భాస్కర్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్‌లో బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సర్పంచ్ బడాల భాస్కర్ రెడ్డి వేశారు. ఉప సర్పంచ్ లక్ష్మణ్, పశుగణ సహాయకుడు కిషోర్, బీఎంసీయూ సూపర్‌వైజర్ యాడారం రమేశ్, రైతులు పాల్గొన్నారు.

రుద్రారంలో పశువైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రుద్రారంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఎంపీపీ మాధవి టీకాలను వేశారు. పశువైద్య సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్‌లో హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మల్లేశ్, గ్రామ పెద్దలు నారాయణ, దయాకర్ రావు, శ్రీధర్ రావు, హిందూ వాహిని ప్రతినిధులు ఉన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ శివారులో నూతనంగా వెలసిన బీడీ వర్కర్స్ డబుల్‌బెడ్‌రూం కాలనీ వద్ద విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. వాటిని తాకితే మూగజీవాలు కాని మనుషులు కాని ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పోడు భూమి పరిశీలన



మాచారెడ్డి: గజ్యానాయక్ తండా, రాజఖాన్‌పేట శివారులోని ఓ రైతు సాగు చేస్తున్న పోడు భూమిని బుధవారం ప్రభుత్వ గంప గోవర్దన్, ఎంపీపీ నర్సింగరావు, అటవీశాఖ ఎఫ్‌డీవో గోపాల్ రావులు పరిశీలించారు. గజ్యానాయక్ తండాకు చెందిన ఓ రైతు శివారులోని పోడు భూమిని సాగు చేస్తున్నాడు. ఇరవై ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో కొంత భాగం అటవీ భూమి అంటూ ఇటీవల అధికారులు రైతుపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్దన్ ఆ భూమిని పరిశీలించి రైతుపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమాచారం..

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు పాఠశాలలో గురువారం నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సృజన్ తెలిపారు. ఈ నెల 10న మాత్రలను పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. నాగిరెడ్డిపేట మండలంలో 8,809 మందికి మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించామని పేర్కొన్నారు.

పోడు పట్టాలతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్


పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: పోడు భూముల పట్టాల పంపిణీతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో గాంధారి, రాజంపేట మండలాల గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టాలు అందించి గిరిజనుల కలను సీఎం నెరవేర్చారన్నారు.

అడవులను నరకొద్దు: ఆర్డీవో

ఆర్డీవో రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ.. గిరిజనులు అడవులను నరికి వేయవద్దని సూచించారు. రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వం హరితహారంలో మొక్కలను నాటి పచ్చదనం పెంచడానికి కృషి చేస్తున్నదన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, గాంధారి జెడ్పీటీసీ శంకర్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు తదితరులున్నారు.

బస్టాండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో జరుగుతున్న ఆర్టీసీ బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను ఆయన పరిశీలించారు. పనుల జాప్యం పట్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ డీఈ సంతోష్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం రాయడం రావాలి


లింగంపేట: మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక స్థాయిలో ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో రామస్వామి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆట పాటలతో పాఠ్య ప్రణాళిక రూపొందించుకొని సులభ పద్ధతిలో బోధించాలని సూచించారు. ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం అభ్యాసన దీపికలు, పాఠ్యప్రణాళికలు ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. మండల నోడల్ అధికారి సాయన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వహీద్ సిద్దిఖీ, సీఆర్పీలు సత్యం, విజయ్ పాల్గొన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: తొలిమెట్టు కార్యక్రమంలో భిక్కనూరులో తెలుగు పాఠ్యాంశాలపై జిల్లా సెక్టోరియల్ అధికారులు శ్రీపతి, వేణుగోపాల్‌శర్మ, శ్రీనాథ్ తదితరులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీలు గోపికృష్ణ, లక్ష్మీనారాయణ రావు, నవీన్, సీఆర్పీలు ఈశ్వర్, మహేందర్, పాపయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): విద్యార్థులకు ఉపాధ్యాయులు సక్రమంగా బోధించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు.

దోమకొండలో..

దోమకొండ: మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితంపై శిక్షణ తరగతులను నిర్వహించి బోధించే తీరుపై అవగాహన కల్పించారు. జిల్లా పరిశీలకులు శ్రీనాథ్, వేణు, శ్రీపతి, తదితరులున్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


చేతుల శుభ్రత గురించి వివరిస్తున్న వైద్యులు

రామారెడ్డి: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రామారెడ్డి వైద్యాధికారి సురేశ్ సూచించారు. ఉప్పల్‌వాయిలో బుధవారం రామారెడ్డి వైద్యుల ఆధ్వర్యంలో ఉప్పల్వాయి ఎస్సీ బాలుర వసతి గృహం, గురుకుల రెసిడెన్సియల్ స్కూల్‌లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు, చేతులు శుభ్రం చేసుకునే పద్ధతుల గురించి విద్యార్థులకు వివరించారు. ఉప్పల్వాయి పల్లెదవాఖాన డాక్టర్ రమ్యశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ భీమ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం ..

తెలంగాణ లెక్చరర్ల సంఘం మహిళా కార్యదర్శిగా రజిత



దోమకొండ: దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న రజిత తెలంగాణ లెక్చరర్స్ గెజిటెడ్ అసోసియేషన్ 475 రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియమించబడిన ఈ సందర్భంలో కళాశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయపాల్ రెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

నూతన ఎగ్జిక్యూటివ్ అధికారిగా శ్రీధర్ రావు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నూతన ఎగ్జిక్యూటివ్ అధికారిగా కామారెడ్డిలోని పంచముఖి హన్మాన్ ఆలయ ఈవోగా పనిచేసిన శ్రీధర్ రావు చుక్కాపూర్‌లో బాధ్యతలు చేపట్టారు. మొన్నటి వరకు ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన ప్రభు రామ్‌చంద్రం, రామారెడ్డి కాల భైరవస్వామి ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హన్మంతరెడ్డి

భిక్కనూరు : మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పి.హన్మంతరెడ్డి, వైస్ చైర్మన్‌గా పురం రాజమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బుధవారం కామారెడ్డిలో వారికి నియామకపత్రం అందజేశారు. అలాగే డైరెక్టర్‌గా బద్దం రాకేశ్‌రెడ్డిని నియమించారు. డీసీఎంఎస్ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీపీ గాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా నరేశ్



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా మేకల నరేశ్‌ను నిమమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తెలిపారు. ఈ మేరకు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నరేశ్ బాధ్యతలు చేపట్టారు. పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడిగా సుదర్శన్

భిక్కనూరు: రైతు బంధు కమిటీ జిల్లా సభ్యుడిగా కాచాపూర్ గ్రామానికి చెందిన తొగరి సుదర్శన్ నియమితులయ్యారు. రైతులకు మంచి సేవలందిస్తానని సుదర్శన్ పేర్కొన్నారు.

మాచారెడ్డి ఎస్సైగా శ్రీనివాస్ గౌడ్

మాచారెడ్డి: మాచారెడ్డి ఎస్సైగా శ్రీనివాస్ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణ కోసం సహకరించాలని ఆయన కోరారు.

సంక్షిప్తం

రేపు టెట్‌పై అవగాహన సదస్సు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని ప్రణతి కోచింగ్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సెంటర్ కరస్పాండెంట్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు మెథడాలజీ నిపుణులు అరుణ్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు 94400 11131.

వందో రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం 100వ రోజుకు చేరాయి. ప్రభుత్వం పరిశ్రమలపై చర్యలు తీసుకుని, కాలుష్యం బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని స్వీపర్లు డిమాండ్ చేశారు. కనీస వేతనం లేకుండా వెట్టి చాకిరీ చేయించుకోవడం శోచనీయమన్నారు.

ప్రతి రోజు వ్యాయామాలు చేయించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామాలు చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించారు.

ఎల్లారెడ్డిలో ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపి క్యాంపులో అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. భవిత సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

కామారెడ్డి అర్బన్: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతి సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, కార్యదర్శి బుగ్గారెడ్డి పాల్గొన్నారు.

102 వాహనానికి పూజలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన నూతన 102 వాహనానికి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ బుధవారం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులున్నారు.

ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేటకు బదిలీపై వచ్చిన ఎస్సై ప్రభాకర్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గోవింద్, దశరథ్, గోపాల్, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలను శుభ్రం చేయించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలోని ప్రతి వార్డులో మురికి కాలువలను శుభ్రం చేయించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. గోలిలింగాల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి మహేశ్ గౌడ్ ఉన్నారు.